# 6. సాహిత్యం – చింతపండు

సాహిత్యమనగా నేమి? దానికి ప్రయోజనమనున దుండునా! దుండితీరవలెనా? దుండితీరనవసరములేదా? అంటూ మన మహాపండితులు నశ్యాండబ్బీ ఖాళీ అయినపుడల్లా అలవాటుగా రాసిపారేస్తూ వచ్చిన చాంతాడు వ్యాసాలు చదివి చదివి అయోమయంలో పడిపోయిన నాకీమధ్య సమాధానం సునాయాసంగా దొరికిపోయింది.

ఓ ఆదివారంనాడు తీరిగ్గా ఇంట్లో కూర్చుని అప్పుడే కిరాణా దుకాణంనుండి మోసుకొచ్చిన సామాన్లన్నీ సరిజూస్తూంటే, చింతపండు పొట్లాంకి చుట్టిన తెల్ల కాగితంపై కేంద్ర సాహిత్య అకాడమీవారి పేరూ, వారి చిహ్నం విశ్వనాథవారి తాజా చారిత్రక నవలల్లోని అభూత కల్పనల్లా కొట్టొచ్చినట్లు కనిపించి కళ్ళు నులుముకున్నాను. అది ఢిల్లీనుండి సదరు అకాడమీవారు భాగ్యనగరంలోని ఓ సాహిత్య శర్మగారికి వ్రాసుకున్న విన్నపం.

సగౌరవంగా, చింతపండునుండి ఆ కాగితాన్ని విడదీసి, మడతలు సరిజేసి, ఇస్త్రీ కూడా చేయించి శ్రద్ధాభక్తులతో చదవగా తేలిన ఆ లేఖా సారాంశమేమంటే :

"ఓ ఘనమైన (సాహిత్య) అయ్యా! మీ తెల్గూ సాహిత్యంలో గడచిన పదేళ్ళలోనూ అచ్చువేయబడిన తెల్గూ

పుస్తకాల్లో గొప్పవేవయినా ఉంటే వాటిని మాకు రికమెండ్ చేయండి. ఎందుకంటే మీ తెలుగు రచయితల్లో ఒకరికి ఐదు వేల రూపాయల ప్రైజు ఇచ్చి, ఆయనగారి అప్పులు తీర్చటం లేదా కూతురి పెళ్ళిచేయించటం లాంటి సాహిత్యసేవ చేయాలని మే మిక్కడ ఓ బరువైన సాహిత్యకంకణం కట్టుకు కూర్చున్నాం."

అది చదివి నేను చాలా సంతోషించాను. ఆ ఉత్తరానికి జతపర్చిన మరో కాగితంలో కొన్ని సాహిత్య తూకపు రాళ్ళూ, వడపోత జల్లెళ్లూ కూడా సవివరంగా సప్లయిచేసి, అవన్నీ జాగ్రత్తగా చదివి జీర్ణించుకుని మరీ ఆ ఫారం రహస్యంగా పూర్తిచేసి, రహస్యంగా సీలుచేసి, రహస్యంగా పోస్టుచేసి, రహస్యంగా తమకు అందేలా చూడమని అకాడమీవారి రహస్య వేడికోలు.

మన భాగ్యనగర తెలుగు సాహిత్య శర్మగారు అకాడమీ ప్రార్థనలను కూడా గౌరవించని దుర్మార్గ ఘనుల్లా ఉన్నారు. పాపం, ఆ సమయానికి వారి నశ్యం డబ్బీ ఖాళీగా ఉండి ఉండవచ్చును. కుర్రాణ్ణి కోమటి దుకాణానికి పంపి క్రొత్త డబ్బీ తెప్పించేందుకు పైసలు లేక ఎందుకేనా మంచిదని చిత్తు కాగితాల్తోపాటు ఈ కాగితాల్ని జతపర్చి పంపి ఉండియుండినోపు. అందులో తప్పేముందండీ!

ఏది ఏమయినా సదరు సాహిత్య శర్మగారు సాహిత్యానికే గాక సాహిత్య సంబంధ లేఖలకు కూడా కనీసం

చిటికెడు నశ్యంలాంటి ప్రయోజనమైనా ఉందని చాంతాడు వ్యాసాలతో నిమిత్తం లేకుండానే ఆచరణ పూర్వకంగా నిరూపించారు కనుక వారి కెన్నయినా థ్యాంక్స్ చెప్పుకో వచ్చును.

చెప్పుకుందామని చూడగా, వెతగ్గా, తేలిందేమంటే - ఇన్నేళ్ళ నా సాహిత్యరంగ పరిచయంలోనూ నే నా తెల్గూ భాగ్యనగర సాహిత్యా శర్మగారి పేరే విని ఉండలేదు వారి రచనలు కనీసం పదిహేనేళ్ళ నాటి 'భారతి' లో నన్నా చదివిన గుర్తు లేదు. అకాడమీవారి అప్పీలును చిత్తుకాగిత ప్రాయంగా, చిటికెడు నశ్య సమానంగా గౌరవించిన ఆ మహానుభావు డెవరా? అని నేను చాలా చాలా వాకబు చేసేను; కానీ తెలియ చెప్పినవా రెవరూ లేకపోయారు.

ఉన్న ఊళ్ళోని నాకూ నా సాహితీ మిత్రులకూ ఏ మాత్రం దొరకని సదరు సాహిత్యా శర్మగారిని ఎక్కడో ఢిల్లీలో ఏర్కండిషన్డు రవీంద్ర భవన్‌లో, ఏర్కండిషన్డు సాహిత్య కాలక్షేపంచేసే, ఖరీదయిన ఏర్కండిషన్డు సాహిత్య ప్రభువులు పట్టుకోగలిగా రంటే వారి దివ్యదృష్టికి మనం ఆనందించవద్దా?

ఇదంతా విని మా అప్పారావుగాడు అన్నాడుగదా; 'అయితే గురూజీ. ఇలాంటి సాహిత్య శర్మలూ, అలాంటి సాహిత్య ప్రభువులూ ఉండబట్టేనా మన తెలుగూ సాహిత్యానికి తద్దినం పెట్టినట్టుగా ఏ అయిదేళ్ళకోసారోగాని గుర్తింపులు రావటం లేదూ?" అని.

నిజమే ననుకోండి. అంతమాత్రాన పెద్దలనూ, వారి పెద్దపెద్ద కొలబద్దలనూ అంత తేలికగా తీసిపారేయగలమా? ఏది ఉత్తమ రచనో కాదో చెప్పాలంటే అంత సులువా? 'మీరు రికమెండ్ చేసే పుస్తకం ఇన్ని కిలోల బరువుండాలి. ఇన్ని వందల పేజీ లుండాలి. కాగితం మీదగాక తాటాకుల మీదనే అచ్చుగుద్దినదయితే శ్రేష్ఠం. రాసినవాడు రిటైర్డు ముసలోడయితే మరీ మంచిది'. లాంటి సాహిత్య పబ్లిక్ రూల్సుతోపాటు 'ఫలానా కులం ఫలానా మతా, ఫలానా గోత్రంకు చెందిన బడుద్ధాయీ అయితేనే శ్రేష్ఠం' లాంటి ప్రైవేట్ రూల్సుకూడా ఉండకపోతే ఎలా చెప్పండి,

అసలే తెలుగుదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకడు కవీ, మరొకడు కధకుడూ, మరొకడు విమర్శకుడూ నని సుప్రసిద్ధం గదా! ఇంతమందిలోంచి ఒకణ్ణి పిలకపట్టి పైకిలాగి వాడి నుద్ధరించాలంటే ఆ మాత్రం రూల్సూ- రహస్యాలూ ఉండొద్దా. కనుక అకాడమీల్ని పడతిట్టే అర్భకుల కూతలు మీరువినకండి. అంతేగాదు; ఎవరేనా వచ్చి మీ దగ్గర పంచాంగం విప్పబూస్తే, వెంటనే-

'ఈ ఏడాది అవార్డుల లిస్టులో నీ పేరుకూడా ఉందటగా! ఏం కథ! ఎవరెవర్ని పట్టావేంటి?......" అని రహస్యంగా వాడి చెవిలో గొణగండి. దాంతో ఆ అర్భక విమర్శకుడు తెల్లమొహం వేసి తక్షణం నోర్మూసేసుకొని, మిమ్మల్ని ఏర్కండిషన్డు రెస్టారెంటుకు లాక్కెళ్ళి, స్పెషల్ ఏర్కండిషన్డు నెస్కాఫీయో, బ్రూ కాఫీయో ఇప్పించగలడు, శుభం.

(జులై 1971)